క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

చారకొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కల్పన మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ యువజన రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తాడూరు: వరి ధాన్యం కొనుగోలు కోసం గన్నీ బ్యాగులతో వెళ్తున్న లారీకి విద్యుత్ తీగలు తగిలి నిప్పంటుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గన్నీ బ్యాగులతో గ్రామానికి వస్తున్న లారీకి గ్రామ సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలాయి. విద్యుదాఘాతంతో గన్నీ సంచుల నుంచి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపుచేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఊర్కొండ: మండలంలోని రేవల్లి, ఊర్కొండ పోలింగ్ కేంద్రాలను మహబూబ్‌నగర్ డీఆర్‌డీఓ నర్సింహులు బుధవారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని టెంట్, తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన ర్యాంపు, వీల్‌చైర్ మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీఓ, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

పెద్దకొత్తపల్లి: కల్వకోలు గ్రామానికి చెందిన గువ్వలి పెంటయ్యకు సంబంధించిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ వరిపైరు చుట్టూ తీగలు అమర్చి విద్యుత్‌షాక్ ఏర్పాటు చేసుకున్నారు. గేదెలు మేత మేసుకుంటూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

డ్రాగన్‌ఫ్రూట్ చెట్లు దగ్ధం



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డికి చెందిన డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి చెట్లు, పైప్‌లైన్ కాలిపోయాయి. బాధితుడు వివరాల ప్రకారం వ్యవసాయ పొలం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెట్లు, పైప్‌లైన్ తీగపందిరి కడీలు కాలిపోయాయని వాపోయారు. ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు.

యువతి అదృశ్యం

వెల్దండ: మండలంలోని ఎర్రవల్లి తండాకు చెందిన యువతి అదృశ్యమైన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రవి వివరాల ప్రకారం మండలంలోని ఎర్రవల్లి తండాకు చెందిన నవనేశ్వరీ ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలవలేదు. తండ్రి బాలునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్‌పై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా పోలీసులు పేర్కొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు

- ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ
- విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి


ఎం. శ్రావణి 418/440


ఆర్ శిరీష 833/1000


అమూల్య సీఈసీ 410


నవ్య ఎంపీసీ 388


బి. కల్యాణి సీఈసీ 915


ప్రవళిక ఎంపీసీ 927


యశోద ఎంపీసీ 927


నందిని ఎంపీసీ 462


నాగర్‌కర్నూల్ గీతాంజలి కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: ఇంటర్మీడియట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లా కేంద్రంలోని గీతాంజలి కళాశాలకు సంబంధించి పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి సన్మానించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో నిశాంత్‌కుమార్ 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించారు. బైపీసీ మొదటి సంవత్సరంలో ఎస్.రాజేశ్వరి 440 మార్కులకుగాను 436 మార్కులు, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎస్. మధుప్రియ 1000 మార్కులకు గాను 989 మార్కులు, బైపీసీ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఎం.ప్రమీల 1000 మార్కులకుగాను 978 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితోపాటు కళాశాల మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యాపక బృందం సన్మానించారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో డి. కల్యాణి 466, జి. పల్లవి 466 మార్కులు సాధించి స్టేట్ మూడో స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎస్. శ్రీవిద్య 465, బిషాల్ జీన 461 వారి తర్వాతి స్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో వీ. నాగలక్ష్మి 378 మార్కులు, సీఈసీ విభాగంలో జవేరియా తబస్సుమ్ 455 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఎంపీసీ విభాగంలో స్నేహ 969, శ్రీహర్ష 960 మార్కులతో సత్తా చాటారు. బైపీసీ విభాగంలో చందు 969 మార్కులు, సీఈసీ విభాగం లో తైసీన్ సుల్తానా 915 మార్కులతో ప్రతిభ చాటారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

మట్టిలో మాణిక్యాలు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో పి. స్నేహిత 470 మార్కులకు గానూ 466 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించింది. ఎంపీహెచ్‌డబ్ల్యూలో కె. శిరీష 500 మార్కులకు గానూ 487, బైపీసీలో అస్రబేగం 410/440 మార్కులతో ప్రతిభ కనబర్చింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఫరియా అంజుమ్ 937/1000, ఎంపీసీలో దీక్షిత 930, ఎంపీహెచ్‌డబ్ల్యూలో అరుణ 922 మార్కులు సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కో ఎడ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంఎల్‌టీలో ఇందు 465, ద్వితీయ సంవత్సరం బైపీసీలో వైష్ణవణ్ 921, ఎంఎల్‌టీలో చింటు 908 మార్కులు సాధించారు.

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటుకున్నారు. సీఈసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని బి.కల్యాణి 915 మార్కులు సాధించింది. ఎంపీసీ విభాగంలో కే.మౌనిక 859 మార్కులు, బైపీసీలో పి.సాయిజయమ్మ 829 మార్కులలో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో జి.గాయత్రీ 409 మార్కులు, బైపీసీలో జి.కుసుమకుమారి 383 మార్కులు సాధించారు.

అమ్రాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభకనబర్చారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 95 మంది విద్యార్థులకు 55 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 106 మంది విద్యార్థులకు 18 మంది విద్యార్థులు ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరంలో అమ్రాబాద్ పేద కుటుంబానికి చెందిన తస్లీమ్‌బేగం ఎంపీసీలో 854, సుమయాబేగం బీపీసీలో 751, సిద్దార్థ సీఈసీలో 743 మార్కులు సాధించారు.

బల్మూర్: ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీల విభాగంలో 40 మందికి గాను 37 మంది ఉత్తీర్ణత సాధించారు. శ్రీవల్లి 417/500, ద్వితీయ సంవత్సరంలో 32 మందికి 28 మంది ఉత్తీర్ణత సాధించాగా చందన 859/1000, ఎంపీడబ్ల్యూఓ విభాగంలో మొదటి సంవత్సరంలో 40 మందికి గాను 37 మంది ఉత్తీర్ణత సాధించగా అనుష 480/500, ద్వితీయ సంవత్సరంలో 36 మంది పరీక్షలు రాయగా 33 మంది ఉత్తీర్ణత సాధించి పల్లవి 904/1000 మార్కులతో ప్రతిభ చాటిందని ఎస్‌ఓ లలిత తెలిపారు.

తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఫలితాలలో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో కే నవ్య 388 మార్కులు సాధించింది. అమూల్య సీఈసీలో 410 మార్కులు సాధించి కళాశాలలో టాపర్‌గా నిలిచింది. బైపీసీలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని 721 మార్కులతో ప్రతిభ చాటింది. ఎంపీసీలో గణేష్ 777 సాధించాడు. ద్వితీయ సంవత్సరంలో 70 మంది పరీక్షలు రాయగా 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 47 శాతం ఫలితాలు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు తెలిపారు.

చారకొండ: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో 60 ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌ఓ మంజుల తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 31 మంది విద్యార్థులకు గాను 20 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం లో 10 మంది విద్యార్థినులకు గాను 6 మంది విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో ఎం.శ్రావణి 418 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరంలో ఆర్. శిరిష 833 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత, ద్వితీయ సంవత్సరం 66 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌ఓ తెలిపారు.

కల్వకుర్తి టౌన్: గురుకుల పాఠశాలలతో పాటుగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రవళిక హెచ్‌ఈసీ విభాగంలో 927 మార్కులు సాధించింది. అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థిని అంకిత బైపీసీ విభాగంలో 986 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది.

నిత్య సాధనతోనే విజయం



కళాశాలలో లెక్చలర్లు చెప్పిన విధానంతో పాటుగా, ప్రతిరోజు చెప్పిన పాఠాలను రివిజన్ చేశాను. సిలబస్‌ను ఏరోజుకు ఆరోజు చదవటంతో రివిజన్‌కు ఎక్కువ సమయం దొరికింది. లెక్చలర్ల సూచనలు, తల్లిదండ్రుల సహకారంతో 1000 మార్కులకు 986 మార్కులు సాధించాను.

–అంకిత, ఇంటర్ బైపీసీ, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల, కల్వకుర్తి

గురుకుల పాఠశాలలో 74 శాతం

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్‌లో 74 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 72 మంది పరీక్షలు రాయగా 53 మంది, మొదటి సంవత్సరంలో 77 మంది పరీక్షలు రాయగా 61 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. ఇంటర్ ద్వితీయ ఎంపీసీ విద్యార్థి బి. చరణ్‌కుమార్ 900 మార్కులు, బైపీసీకి చెందిన వి.సంతోష్ 825 మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఎమ్మెల్టీలో 928 మార్కులతో సీ.కిరణ్ టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన బాలికలు 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌ఓ శారద తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 34 మంది పరీక్షలు రాయగా 31 మంది ఉత్తీర్ణత సాధించారు. బి.సింధూ 944 మార్కులతో టాపర్‌గా నిలువగా ఎంపీసీ విభాగంలో 858 మార్కులతో పి. శివమ్మ టాపర్‌గా నిలిచినట్లు ఎస్‌ఓ తెలిపారు.

మన్ననూరు గురుకులంలో 100 శాతం

మన్ననూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ 40, బైపీసీ 40 మొత్తం 80 విద్యార్థులకు గానూ 80 మంది ఉత్తీర్ణులై 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా పీటీజీ పాఠశాలలో మొత్తం 26 మంది విద్యార్థులకు గానూ 20 మంది ఉత్తీర్ణత సాధించారు.

బాలికలదే హవా

కోడేరు: మండలంలోని ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాల్లో బాలికలదే పై చేయిగా నిలిచారు. ఆదర్శ మోడల్ కాలేజీలో ఇంటర్మీయట్ ప్రథమ సంవత్సరం పరీక్షలో మొత్తం 68 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 41 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో శ్రీదేవి 393, కీర్తన 387 మార్కులు సాధించారు. ఎంపీసీలో నందిని 462, చందన 441 మార్కులతో ప్రతిభ చాటారు. సీఈసీలో లోకేష్ 319 మార్కులు సాధించాడు. ద్వితీయ సంవత్సరం పరీక్షలో మొత్తం 82 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 63 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో ప్రవల్లిక 927, యశోద 927, హేమలత 861 మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీలో గీత 887 శిరిష 870, శ్రావణి 861, శ్రీజ 873, మార్కులు సాధించారు. సీఈసీలో అక్షయ 875, రాజేశ్వరి 701 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమ అస్రా తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బైపీసీలో 338, రంగామయూరి 333 మార్కులు సాధించారు. ఎంపీసీలో గణేష్ 338, మార్కులతో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలో రాఘవేంద్ర ఎంపీసీలో 888, రవివర్మ 883 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బళ్ళారి శేఖర్ తెలిపారు.

ఇంజనీర్ అవుతా...



మాది పేద కుటుంబం. ప్రైవేటులో చదువుకునే స్తోమత లేక ప్రభుత్వ కళాశాలలో తల్లిదండ్రులు చేర్పించారు. లెక్చరర్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విన్నాను. వారి సూచనలు, సలహాల మేరకు చదువుతూ ముందుకు సాగాను. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గానూ 466 మార్కులు సాధించా. భవిష్యత్‌లో ఇంజనీర్, సైంటిస్టు కావాలని ఉంది. అమ్మనాన్న లింగాల రోడ్డులో చిన్న తోపుడు బండిపై దుస్తులు విక్రయిస్తారు. మొత్తం ముగ్గురం అక్కాచెల్లెళం ఉన్నా. ఎవరైనా ఆర్థికంగా సహకరిస్తే ఉన్నత విద్యలో మంచిగా రాణిస్తాను.

– స్నేహిత, ప్రభుత్వ బాలికల కళాశాల, అచ్చంపేట

గురుకుల కళాశాలలో ప్రథమ పరీక్ష ఫలితాల్లో 67 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో నేహ 465, బైపీసీలో తులసి 433 మార్కులు సాధించారు. ద్వితీయసంవత్సరంలో 73 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 73 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో సౌమ్య 967, బైపీసీలో స్వప్న 964 మార్కులు సాధించారు. ప్రథమ పరీక్ష ఫలితాలో 92 శాతం ద్వితీయ పరీక్ష ఫలితాలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రష్మి తెలిపారు.

మైనార్టీ గురుకుల కళాశాలలో..

కొల్లాపూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యార్థినులు ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. హెచ్‌ఈసీ ఫస్టియర్‌లో ఎస్‌కే.రిజ్వానా 468 మార్కులు, సెకండ్ ఇయర్‌లో నజియా 791 మార్కులతో సత్తాచాటారు. సీఈసీ ఫస్టియర్‌లో ఎస్.అక్షిత 478 మార్కులు, సెకండ్ ఇయర్‌లో అమీనా 917 మార్కులు, నస్రీన్ బేగం 900 మార్కులు, సమీరా బేగం 900 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నిరూప తెలిపారు.

వెల్దండ: మండల కేంద్రంలో ఉన్న మాడల్ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. మొదటి సంవత్సరంలో 51 శాతం, ద్వితీయ సంవత్సరంలో 53 శాతం ఫలితాలు వచ్చాయని ఆమె తెలిపారు. బైపీసీ ద్వితీయ విభాగంలో చందన 888 మార్కులు సాధించారు.

పాలెం విద్యార్థుల ప్రతిభ

బిజినేపల్లి: మండలంలోని పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కే మానస 977 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో శ్రీవాణి 880 మార్కులు సాధించింది. ఒకేషనల్‌లో కే గౌరిశంకర్ 902 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎ.అజయ్‌కుమార్ 399 మార్కులు సాధించాడు. బైపీసీలో ఈ. హేమలత 392 మార్కులతో ప్రతిభ చాటింది. ఒకేషనల్ విభాగంలో వీ.గురువయ్య 463 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

కాంగ్రెస్ హామీలు నమ్మొద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ ఇస్తున్న హామీలను చూసి ప్రజలు మోసపావద్దని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆపార్టీ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అయిన ఏ ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చలేదని ఎన్నికల కోడ్ పేరిట కాలయాపన చేస్తుందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈనెల 25న బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ నామినేషన్ దాఖలుకు గుజరాత్ సీఎం భూపేంద్రసింగ్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ రాములు హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జిల్లా కేంద్రంలోని బస్‌డిపో నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ అనంతరం సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, ఎలిమె రాము, బూషయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కూలీలకు మౌలిక వసతులు కల్పిస్తాం


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

తెలకపల్లి: ఉపాధి కూలీలకు పని ప్రదేశాల వద్ద మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని గౌరెడ్డిపల్లి, గట్టునెల్లికుదురు గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంట్, మెడికల్ కిట్‌ను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం హాల్‌లో ఉపాధిహామీ సిబ్బందికి, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మల్లేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్వకుర్తిరూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ వెంకటరాములు అన్నారు. బుధవారం మండలంలోని తర్నికల్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నర్సరీని సందర్శించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని కార్యదర్శికి సూచించారు. గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆశీర్వదించండి


మాట్లాడుతున్న గువ్వల బాల్‌రాజ్

వంగూరు: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నికల్లో ఎంపీగా ఆశీర్వదించాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వైవీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఓటర్లకు వివరించాలని కోరారు. సమావేశంలో నాయకులు గణేష్‌రావు, నరేందర్ రావు, విజయేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, శ్రీపతి రావు, ఎల్లగౌడ్, అంకు సురేందర్ పాల్గొన్నారు.

ఐస్‌క్రీం తయారీ కేంద్రాల్లో తనిఖీ



కల్వకుర్తి: పట్టణంలోని పలు ఐస్‌క్రీం కేంద్రాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఐస్‌క్రీమ్ తయారీ సామగ్రిని పరిశీలించారు. తయారీ కేంద్రాల్లో అపరిశుభ్రత, నాణ్యత లోపించడంతో కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన పోతుగంటి నరేందర్ బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావుతో పాటు నరేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పార్టీల చేరడంతో స్థానికంగా కాంగ్రెస్ పుంజుకోనుంది.

ముగ్గురిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి: సాతాపూర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి సలేశ్వరానికి సంబంధించిన గొర్రె పొట్టేళ్లను ఈ నెల 19న రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. రేవెల్లి మండలంలోని తలుపునూరు గ్రామానికి చెందిన పెద్దగాళ్ల సాయికుమార్, గాలిగాళ్ల బాలకృష్ణ, వెన్నచర్ల గ్రామానికి చెందిన కావలి మహేష్‌లు గొర్రె పొట్టేళ్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిందితుల నుంచి ఆరు గొర్రె పొట్టేళ్లతో పాటు ఒక టవేరా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచారు.

రెండు కార్లు ఢీ: పలువురికి గాయాలు


చెట్ల పొదల్లో పల్టీ కొట్టిన కారు

లింగాల: మండల కేంద్రం నుంచి అచ్చంపేట వెళ్లే మార్గంలో సూరాపూర్ గేటు సమీపంలో ఎదురెదురుగా రెండు కార్లు ఢీ కొని పలువురికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం అచ్చంపేట నుంచి కోమటికుంటకు వెళ్తున్న కారు అదేవిధంగా లింగాల నుంచి అచ్చంపేటకు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఒక కారు రోడ్డు పక్కకు పల్టీ కొట్టి చెట్ల పొదలకు దూసుకెళ్లింది. మరో కారు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ ప్రమాదంలో 7 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కార్లలో ఉన్న ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



అమ్రాబాద్: అమ్రాబాద్, పదర మండలాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి నలుగురిపై కేసు నమోదు చేశారు. అమ్రాబాద్ మండలంలోని ఉప్పునుంతల(బీకే), తిర్మలాపూర్(బీకే), పదర మండలంలో చెన్నంపల్లి, చిట్లంకుంట, ఉడిమిళ్ల గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. 20 లీటర్ల సారా, 16 బీర్లు, 6 క్వాటర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఎక్సైజ్ సీఐలు, కృష్ణయ్య, కల్యాణ్, వెంకటరెడ్డి సిబ్బంది ఉన్నారు.

దేవాలయంలో ఆభరణాల చోరీ

- 250 తులాల వెండి, రెండు తులాల బంగారం అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: గురుతెలియని వ్యక్తులు మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తలుపులు విరగొట్టి గర్భగుడిలో ఉన్న 250తులాల వెండి ఆభరణాలతో పాటు 2తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆలయ అర్చకుడు బుధవారం ఆలయంలో గర్భగుడి తలుపులు తెరిచి ఉండటం గమనించి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ అర్చకుడు సుందరాచార్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవం


గౌరారం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఏఎన్‌ఎం శారద

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 2లో బుధవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు చదువు ప్రాధాన్యాన్ని అంగన్‌వాడీ టీచర్ సరస్వతి వివరించారు. ఐదేళ్లు పైబడిన పిల్లలను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తామన్నారు. మూడేళ్ల వయస్సు నిండిన బాలబాలికలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని రాకొండ, గోలగుండం, గౌరారం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ కేంద్రాల్లో అందుతున్న సేవలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. గౌరారంలో పౌష్టికాహారంపై ఏఎన్‌ఎం శారద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, ప్రభావతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.